

తిరుపతి బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,100
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.70,000
రిటైల్ వెండి గ్రాము	రూ.72

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	31	19
చిత్తూరు	30	19
తిరుమల	26	16
గూడూరు	31	21
నగరి	31	20



గజ వాహనంపై పద్మావతి విహారం

తిరుచానూరు : పద్మావతి అమ్మవారు ఆదివారం సాయంత్రం గజవాహనంపై మాడ వీధుల్లో ఊరేగారు. అమ్మవారి జన్మనక్షత్రమైన ఉత్తరాషాఢ నక్షత్రం సందర్భంగా గజవాహన సేవ నిర్వహించారు.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో స్పందన

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు నిర్వ హించే స్పందనకు అధికారులందరూ తప్పకుండా హాజరుకావాలని చెప్పారు. తిరుపతి సెంట్రల్ బస్టాండ్ నుంచి ప్రతిరోజు ఆర్టీసీ సర్వీసులు కలెక్టర్‌కు ఏర్పాటు చేశామని చెప్పారు. అంతేకాకుండా అర్జీలను రాసి ఇవ్వడానికి ఇద్దరు వీఆర్వోలను ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు



తిరుమలలో హైకోర్టు న్యాయమూర్తి ప్రవీణ్ కుమార్

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 12 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 78,158 మంది స్వామివారిని దర్శించుకోగా.. 27,090 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.73 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 2 గంటల సమయం పడుతోంది. తిరుమల శ్రీవారిని ఆదివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

నేటి నుంచి టెన్నిస్ టోర్నమెంట్

శ్రీకాళహస్తి: పట్టణంలో సోమవారం నుంచి ఆలిండియా నేషనల్ సీనియర్ టెన్నిస్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ పోటీలకు పట్టణంలోని దక్షిణకైలాసనగర్‌లో ఉన్న విక్రమ్ టెన్నిస్ అకాడమి వేదిక కానుంది. ఈ నెల 23 నుంచి 29 వరకు పోటీలు నిర్వహించనున్నారు. శ్రీకాళహస్తిలో మొదటి సారిగా నిర్వహిస్తున్న ఈ పోటీలను ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు విక్రమ్ టెన్నిస్ అకాడమి వ్యవస్థాపకుడు డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. విజేతకు రూ.4 లక్షల ప్రైజ్‌మనీ ఉంటుందన్నారు.

ప్లంబర్ కోర్సులో ఉచిత శిక్షణ

తిరుపతి అర్బన్: ప్లంబర్ కోర్సులో ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ జిల్లా సహాయ సంచాలకులు కే.విజయప్రతాప్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ సహకారంతో 90 రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. శిక్షణ సమయంలో స్టేషనరీ, యూనిఫాంతోపాటు 15 కిలోమీటర్ల లోపు ఉన్నవారికి ఉచిత బస్సు పాస్ ఇవ్వనున్నట్లు వివరించారు. శిక్షణ అనంతరం నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారిచే సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. పదోతరగతి, ఇంటర్, ఐటీఐ చదువుకున్న 18–35 ఏళ్ల వారు అర్హులుగా పేర్కొన్నారు. వివరాలకు 9700413939, 9000894035ను సంప్రదించాలని కోరారు.

ప్రపంచీకరణ నేపథ్యంలో అతివేగంగా పాశ్చాత్య సంస్కృతి భారతీయులను చుట్టుముట్టేసింది. అయితే అదే సమయంలో అనారోగ్యం వెంటాడింది. దీనికితోడు కరోనా వచ్చి మన సంప్రదాయాల ప్రాధాన్యతను గుర్తు చేసింది. అంతే.. పాత రోజుల వైపు జీవనశైలి మళ్లింది. మట్టి, రాగి పాత్రలకు గిరాకీ వచ్చింది. తిరగలి, రుబ్బు రోళ్లకు పూర్వ వైభవం వచ్చింది. సేంద్రియం, చిరుధాన్యాల వైపు రైతాంగం మొగ్గు చూపుతోంది. మొత్తంగా మన లైఫ్ స్టైల్ యూ టర్న్ తీసుకుంది.



తిరగలితో విసిరిన మినుములు



డక్కిలి మండలంలో రోట్లో ఇడ్లీపిండి రుబ్బుతున్న మహిళ



వెంకటగిరిలో మట్టిపాత్రల్లో వంటచేస్తున్న మహిళ

ఆరోగ్యానికి పూర్వ వైభవం

- ఆ పాత మధురం.. ఆరోగ్య జీవనం
- మళ్లీ మట్టి పాత్రలు, గానుగ నూనెల వినియోగం
- చిరుధాన్యాల సాగు, సేంద్రియ విధానం
- మిద్దెలపై కూరగాయల సాగు

వెంకటగిరి: మన పూర్వీకుల సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు, జీవన విధానంపై మళ్లీ అన్వేషణ మొదలైంది. క్రమంగా మన జీవన శైలి మలుపు తిరిగింది. ఎక్కడైతే ఈ ప్రయాణం మొదలు పెట్టామో తిరిగి తిరిగి అక్కడికే వెళుతోంది. ఒక తరానికి ముందు ప్రజలు ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకునేవారు. ఇందుకోసం రాగులు, సజ్జలు, కొర్రలు, అరికెలు, అండు కొర్రలు వంటి పంటలను సాగుచేసేవారు. వాటిని వాడుకుని, మిగిలిన వాటిని విక్రయించేవారు. వీటిని పండించడంలో సేంద్రియ పద్ధతులను అనుకరించేవారు. అందుకే నాటితరంవారు ఆరోగ్యవంతులుగా ఉండేవారు. కాలక్రమంలో అధిక దిగుబడుల కోసం మోతాదు మించి రసాయనిక ఎరువుల వినియోగం ఎక్కువయింది. వాటిని ఆహారంగా తీసుకున్న వారిలో సైతం పలు ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. దీంతో పల్లెలు, పట్టణాలు అని తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో షుగర్, బీపీ వంటి దీర్ఘ కాలిక వ్యాధులు చుట్టుముట్టేశాయి. వీటికితోడు కరోనా మరో గుణపాఠం నేర్పింది. దీంతో ప్రతి ఒక్కరూ తమ జీవనశైలిలో మార్పులు చేసుకోవడం ఆరంభించారు. రోజూ వాడే బియ్యం నుంచి వినియోగించే వంటపాత్రల వరకూ పాత పద్ధతులను అనుసరిస్తున్నారు. వెంకటగిరి వంటి చిన్న చిన్న పట్టణాల్లో సైతం కొర్రలు, సజ్జలు, రాగులు విక్రయించే దుకాణాలు వెలుస్తున్నాయి. ఆరోగ్య స్పృహ పెరుగుతున్న నేపథ్యంలో ముడి బియ్యం, సేంద్రియ కూరగాయలను వాడేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

కొర్రలన్నం.. రాగి సంగటి

జొన్నన్నం, రాగిసంగటి 50 ఏళ్ల క్రితం ప్రధాన ఆహారం. తెల్లటిబియ్యం రాకతో కనుమరుగైన ఈ చిరుధాన్యాలు ఇప్పుడు మళ్లీ వినియోగంలోకి వస్తున్నాయి. దీంతో వీటికి పూర్వ వైభవం వచ్చింది. బియ్యం బదులు ఒకపూట చిరుధాన్యాల భోజనంపై ఆసక్తి కనబరుస్తున్నారు. జొన్న, సజ్జ, రాగి తదితర చిరుధాన్యాలతో తయారు చేసిన చిరుతిండ్లకు డిమాండ్ పెరుగుతోంది. దీంతో వీటి సాగుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు.

తిరగలి..రుబ్బురోళ్లు

పల్లెల్లోనే కాదు పట్టణాల్లో కూడా రోళ్లు, తిరగళ్లు అడుగుపెడుతున్నాయి. రోట్లో రుబ్బిన పిండితో తయారు చేసే ఆహార పదార్థాలు మెత్తగా, రుచిగా ఉన్నాయంటున్నారు. బయట కొనుగోలు చేస్తున్న పప్పుల్లో వేర్వేరు పదార్థాలు కల్తీ అవుతున్నాయని, మినుములు, పెసలు వంటివి గింజలు కొనుక్కుని తిరగలిలో విసురుకుని పప్పు చేసుకుంటున్నారు.

సమస్తం.. సేంద్రియం

రసాయన రహిత కూరగాయలు, ఆకుకూరలు, ఆహారధాన్యాల వాడకం రోజురోజుకూ పెరుగుతోంది. జీవామృతం, ఘన జీవామృతం, పంచగవ్య ఆధారిత ఎరువులతో పండించే వారి పొలాల వద్దకే వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. సేంద్రియ ఉత్పత్తులకు పెరుగుతున్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని పట్టణాల్లోనూ దుకాణాలు వెలుస్తున్నాయి.

రాగి చెంబులు, మట్టిపాత్రలు

దశాబ్దాల క్రితం వంటకు వినియోగించే రాగి, మట్టిపాత్రల స్థానంలో క్రమంగా అల్యూమినియం, స్టీలు పాత్రలు ఉపయోగంలోకి వచ్చాయి. ధరలు అందుబాటులో ఉండడం, బరువు తక్కువగా ఉండడంతో వీటి వినియోగం పెరిగింది. అయితే ఈ తరహా పాత్రల్లో వండినవి తినడం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. దీంతో మళ్లీ ఇత్తడి, మట్టితో చేసిన పాత్రల వైపు మొగ్గుచూపుతున్నారు. రాగి పాత్రలో నీరు తాగడం ఆరోగ్యకరమని పరిశోధనల్లో రుజువు కావడంతో రాగి వాటర్ బాటిళ్లు, కూజాలు మార్కెట్లో లభిస్తున్నాయి. పలువురు శుభకార్యాల్లో రాగిగ్లాసులను సైతం బహూకరిస్తున్నారు. అల్యూమినియం పాత్రల కంటే ప్రస్తుతం మట్టిపాత్రల ధరలే అధికంగా ఉన్నాయి. అయినా వాటిని వినియోగించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

మిద్దె పంటలు

కూరగాయలు పండించే రైతులు చాలామంది వాటిని చీడపీడల నుంచి కాపాడేందుకు రకరకాల పురుగు మందులు పిచికారీ చేస్తుంటారు. త్వరగా వచ్చేందుకు రసాయనిక ఎరువులు వాడుతుంటారు. వీటి వల్ల ఆరోగ్యపరంగా దుష్ప్రభావాలు ఉంటాయన్న ఆలోచనతో పెరట్లోనే సొంతంగా కూరగాయాలు పెంచుకుంటున్నారు. అయితే పట్టణాల్లో స్థలాల కొరత కారణంగా మిద్దెల పైనే ఆకుకూరలు, కూరగాయలు పండించడం మొదలుపెట్టారు.

గానుగ నూనెల వాడకంపై ఆసక్తి

చిన్న చిన్న పట్టణాల్లో సైతం గానుగనూనె వాడకం పెరుగుతోంది. ఉడ్ ప్రెస్ ఆయిల్ కోరుకునేవారికి దగ్గరుండి కల్తీలేని నూనెను పట్టిఇచ్చే దుకాణాలు వెంకటగిరిలోనూ కనిపిస్తున్నాయి. ఎక్కువమంది వేరుశనగ, కొబ్బరినూనెలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. మార్కెట్‌లో లభించే నూనెల కంటే రెండు, మూడు రెట్లు అధిక ధర ఉంటున్నా, ఆరోగ్య రీత్యా ఆ నూనెల కొనుగోళ్లకే మొగ్గు చూపుతున్నారు.



అమ్మకానికి రాగి పాత్రలు



వెంకటగిరిలో మిద్దెతోట



వెంకటగిరిలో నూనెలు తీసే గానుగలు

పిండి వంటలకూ గానుగనూనెలే



సంక్రాంతి పండుగకు చేసుకున్న పిండివంటలకూ ఈ ఏడాది గానుగ నూనెనే వినియోగించాం. ఆ నూనెలతో తయారు చేసిన ఆహారపదార్థాలు మంచి వాసన, రుచిగా ఉంటున్నాయి. దీంతో ఈ ఏడాది అరెసెలు కూడా గానుగ నూనెలోనే తయారు చేశాం.

– కె భాగ్యమ్మ, వెంకటగిరి

మేమే పండించుకుంటున్నాం



సేంద్రియ పద్ధతిలో సొంతంగా పండించిన కూరగాయలు వండుకుంటాం. మిద్దెపైనే 50 రకాల కూరగాయలు, పూల మొక్కలు పెంచుతున్నాం. గతంలో మార్కెట్‌లో కొనుగోలు చేసి వినియోగించేవాళ్లం. అయితే మిద్దెతోటలపై శిక్షణ తీసుకుని తోటను పెంచడం వల్ల ఖర్చులు గణనీయంగా తగ్గాయి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటున్నాం అనే తృప్తి ఉంది.

– ఎం కుమారి, రాణిపేట, వెంకటగిరి

బంతి భోజనాల్లో రాగి సంగటి



బంతి భోజనాల్లో కొంతకాలంగా రాగి సంగటి పెడుతున్నారు. గతంలో బంతి భోజనం అంటే పులిహోర, ఆ తర్వాత ఆ స్థానాన్ని వెజ్ బిరియాని ఆక్రమించింది. ప్రస్తుతం వాటి బదులు రాగిసంగటి ఉండేలా చూస్తున్నారు. మరికొంతమంది కొర్ర అన్నం, సగ్గుబియ్యంతో చేసిన రుచికరమైన పాయసం చేసి మరీ వడ్డిస్తున్నారు.

– బి.కరుణాకర్‌రెడ్డి, వెంకటగిరి

జిల్లాలో మంత్రుల పర్యటన షెడ్యూల్

తిరుపతి అర్బన్: జిల్లాలో సోమ, మంగళవారాల్లో మంత్రుల పర్యటన షెడ్యూల్ ఖరారైనట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆదివారం రాత్రి 7.15 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకొని, 8.30 గంటలకు తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకుని తిరుమల చేరుకుంటారు. సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని 10.30 గంటలకు రోడ్డు మార్గాన విజయవాడకు బయల్దేరుతారు. పౌరసరఫరాల శాఖ మంత్రి కె.వెంకట నాగేశ్వరరావు సోమవారం రాత్రి 7.15 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకొని, అక్కడి నుంచి తిరుమల వెళ్లి రాత్రి బస చేస్తారు. మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని, ఉదయం 11 గంటలకు తిరుపతిలో జరిగే తొమ్మిది జిల్లాల పౌరసరఫరాల శాఖ అధికారుల సమీక్షలో పాల్గొంటారు. ఈనెల 25, 26 తేదీల్లో తిరుమలలో నిర్వహించే కార్యక్రమాలలో పాల్గొని తిరుగు ప్రయాణం కానున్నారు.

నేటి నుంచి జాతీయ వర్క్‌షాప్

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని డీబీఆర్ రోడ్డులో ఉన్న స్టార్ లైట్ షూట్స్‌లో సోమవారం నుంచి జాతీయ స్థాయి వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు బుడ్డోళ్ల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ బి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, తిరుపతిలోని బుడ్డోళ్ల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ సంయుక్తంగా దీన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జీవశాస్త్ర పరిశోధనలో బహుళ విభాగాలు అనే అంశంపై వర్క్‌షాప్ ఉంటుందని తెలిపారు. ఈ వర్క్‌షాపును సోమవారం విక్రమ సింహపురి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ సుందరవల్లి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించనున్నట్లు వివరించారు.

దేశానికే ఆదర్శం సచివాలయం



బంగారుపాళెంలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

బంగారుపాళెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకువచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని గనులు, భూగర్భ వనరులు, విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. రూ.80 లక్షలతో నిర్మించిన బంగారుపాళెం 1,2 గ్రామ సచివాలయ భవనాలు, రూ 21.75 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాన్ని ఆదివారం సాయంత్రం మంత్రి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన మూడన్నరేళ్ల పాలనలో అనేక సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందన్నారు. ప్రజలకు అవసరమైన సేవలను ఆయా ప్రాంతాలలోనే అందించాలన్న ఉద్దేశంతో గ్రామ సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందేనన్నారు. ప్రజలకు అవసరమైన 500 రకాల సేవలను గ్రామ సచివాలయాల ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా రైతు భరోసా కేంద్రాలు, ప్రజా వైద్యానికి వైఎస్సార్ హెల్త్ క్లినిక్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

మసీదు అభివృద్ధికి కృషి

బంగారుపాళెం జామీయా మసీదు అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి పెద్దిరెడ్డి హామీ ఇచ్చారు. గ్రామ సచివాలయాల ప్రారంభోత్సవం తరువాత మంత్రి మసీదును సందర్శించారు. మత పెద్దలు, ముస్లింలు మసీదు అభివృద్ధికి సహకరించాలని కోరారు. స్పందించిన మంత్రి గతంలో షాదీమహల్ నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేశామని, మసీదు అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

గజబాధితులకు పరిహారం

మండలంలో ఏనుగుల దాడిలో పంటలు నష్టపోయిన రైతులకు మంత్రి పరిహార చెక్కులను అందజేశారు. అటవీ సరిహద్దు గ్రామాల్లో పంటపొలాలపై ఏనుగుల దాడుల కట్టడికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ రామచంద్రారెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్, సింగిల్ విండో చైర్మన్ దత్తాత్రేయరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సోమశేఖర్, సర్పంచ్ ఉమాదేవి, ఎంపీటీసీ సభ్యులు పద్మావతి, ఉష, టీటీడీ పాలకమండలి సభ్యుడు అశోక్‌కుమార్, జానపద కళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు పెయింటింగ్ పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని కేంద్రీయ విద్యాలయ-1లో ఈ నెల 23వ తేదీన జిల్లా స్థాయి పెయింటింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ పి.అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది నిర్వహిస్తున్న పరీక్షా పే చర్చ కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది ఈ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా ఉన్న సీబీఎస్‌ఈ, స్టేట్ బోర్డ్ స్కూల్స్ విద్యార్థులు పాల్గొనవచ్చని ఆమె తెలిపారు. ఈ పోటీలు తిరుపతి, వెంకటగిరి, రేణిగుంటలోని కేంద్రీయ విద్యాలయాలతోపాటు, తిరుపతిలోని సిల్వర్ బెల్స్, భారతీయ విద్యాభవన్, లిటిల్ ఏంజెల్స్ స్కూల్స్‌లో నిర్వహించనున్నారు. ప్రతి ఏటా సెకండరీ, సీనియర్ సెకండరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులనుద్దేశించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

వేంకటేశ్వరుని సేవలో కలెక్టర్

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని తొండమాన్‌పురం గ్రామంలో వెలసిన టీటీడీ అనుబంధాలయమైన శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వారి వెంట ఆలయ పర్యవేక్షకులు ఆనంద్, సదాశివయ్య ఉన్నారు.



ఆలయంలో కలెక్టర్ దంపతులు

ప్రశాంతంగా కానిస్టేబుల్ ప్రిలిమ్స్

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 40,102 మంది హాజరు
- దళారులను నమ్మి మోసపోవద్దు
- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన ఎస్పీలు

చిత్తూరు అర్బన్: పోలీసు కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఆదివారం చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో జరిగిన పరీక్షలకు మొత్తం 43,448 మంది అభ్యర్థులకు గానూ, 40,102 మంది హాజరయ్యారు. చిత్తూరులో 870, తిరుపతిలో 110 పోలీసు కానిస్టేబుల్ పోస్టులకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది నోటిఫికేషన్ ఇవ్వగా.. పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా ప్రిలిమ్స్ నిర్వహించారు. చిత్తూరు జిల్లాలో 12,196 మందికి గానూ 11,254 మంది హాజరయ్యారు. తిరుపతి జిల్లాలో 31,252 మందికి గానూ 28,848 మంది పరీక్షలు రాశారు. భారీ బందోబస్తు నడుమ ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి ముందస్తు చర్యలు చేపట్టారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

చిత్తూరు ఎస్పీ రిషాంత్‌రెడ్డి స్థానిక పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నాయుడు బిల్డింగ్స్‌లోని పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. తిరుపతిలో ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి ఎస్వీఆర్ట్స్ కళాశాల, ప్రకాశం భవన్, చదలవాడ, మంగళం ఎస్వీ కళాశాల, అన్నమాచార్య కళాశాల కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. ఎస్పీలు వేర్వేరుగా మాట్లాడుతూ ఎక్కడా కూడా అనుమానాలకు తావులేకుండా పరీక్షలను పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు. జవాబు పత్రాలను పటిష్ట భద్రత మధ్య పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డుకు పంపనున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ దళారుల అవతారం ఎత్తే ఏ ఒక్కర్నీ నమ్మొద్దని.. అన్ని పరీక్షల్లో పాసైన వాళ్లకు ఉద్యోగం తప్పకుండా వస్తుందన్నారు. చిత్తూరులోని ఎస్వీ కళాశాల వద్ద రెండు నిమిషాలు ఆలస్యంగా వచ్చినందుకు ఓ అభ్యర్థి పరీక్ష రాయలేకపోయాడు.



తిరుపతి: పరీక్ష కేంద్రంలోకి వెళుతున్న అభ్యర్థులు



తిరుపతి: తనిఖీకి వెళుతున్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి



చిత్తూరు: పరీక్ష కేంద్రంలో ఎస్పీ రిషాంత్‌రెడ్డి

కారు దగ్ధం.. తప్పిన ప్రాణాపాయం



గంగవరం: బానెట్ నుంచి హఠాత్తుగా మంటలు చెలరేగడంతో కారు దగ్ధమైంది. అందులో ప్రయాణిస్తున్న వారు అప్రమత్తం కావడంతో ప్రాణాలతో బయటపడ్డారు. మండలంలోని పత్తికొండ వద్ద ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు, కాణిపాకానికి చెందిన విక్రమ్‌రెడ్డి భార్య, ఇద్దరు పిల్లలతో కారులో బెంగళూరుకు బయలు దేరారు. పలమనేరు బెంగళూరు జాతీయ రహదారిపై పత్తికొండ సమీపంలో కారులో ఏదో కాలుతున్న వాసన వస్తుండడంతో విక్రమ్‌రెడ్డి రోడ్డు పక్కకు ఆపి, ముందర బానెట్ తెరిచి చూశాడు. అందులో మంటలు చెలరేగుతుండడాన్ని గమనించి వెంటనే భార్య, పిల్లలు కారు దిగేశారు. క్రమంగా కారు నుంచి మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. గ్రామస్తులు అక్కడికి చేరుకుని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న బంధువు పలమనేరు ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకుని విక్రమ్‌రెడ్డి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.



సాక్షి స్పెల్‌బీతో ప్రతిభకు పదును

- అధిక సంఖ్యలో హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు
- ఆంగ్లంలో రాణించేందుకు స్పెల్‌బీ సరైన వేదిక



స్పెల్ బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు



స్పెల్‌బీ పరీక్ష లైవ్‌లో..

తిరుపతి ఎడ్యుకేషన్ : ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించేలా, వారి ప్రతిభకు పదును పెట్టేందుకు సాక్షి స్పెల్‌బీ దోహదం చేస్తోంది. ప్రస్తుతం ఉన్నత విద్య అయినా, ఉన్నత కొలువైనా సాధించాలంటే ఆంగ్ల భాష తప్పనిసరి. ఇంగ్లీష్ భాషపై పట్టు, నైపుణ్యం, సామర్థ్యం, ఒడిసి పట్టుకుంటేనే నేటి తరం ఉన్నతంగా రాణిస్తుంది. ఇంగ్లీష్ భాషపై విద్యార్థుల్లో అవగాహన కల్పించి, వారిలో నైపుణ్యం, ఆసక్తిని పెంపొందించేందుకు ప్రతి ఏటా సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా స్పెల్‌బీ పరీక్షలు నిర్వహిస్తోంది. తద్వారా వారిలో దాగున్న ప్రతిభకు పదునుపెడుతోంది. ప్రాథమిక, క్వార్టర్, సెమీఫైనల్, ఫైనల్ నాలుగు దశల్లో స్పెల్‌బీ నిర్వహించి.. ఫైనల్‌లో సత్తా చాటిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులను అందిస్తోంది. ఈ పరీక్షకు ప్రధాన స్పాన్సర్‌గా డ్యూక్స్ వేఫి, అసోసియేషన్ స్పాన్సర్‌గా రాజమండ్రికి చెందిన ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవహరిస్తోంది. సాక్షి నిర్వహిస్తున్న స్పెల్‌బీ పరీక్షలకు పాఠశాల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రత్యేక ఆసక్తి కనబరుస్తున్నారు. ఎప్పటిలానే ఈ ఏడాది సైతం విద్యార్థులు ఈ పరీక్షకు అధిక సంఖ్యలో హాజరై తమ ప్రతిభను చాటుకున్నారు. ఇందులో భాగంగా ఆదివారం తిరుచానూరు రోడ్డు, శ్రీనివాసపురంలోని హోలీ గ్రీన్ పాఠశాలలో స్పెల్‌బీ సెమీఫైనల్స్ నిర్వహించారు. ఇదివరకు పాఠశాల స్థాయి, జిల్లా స్థాయి(క్వార్టర్ ఫైనల్స్)లో జరిగిన ఈ పరీక్షలో విజేతలకు సెమీఫైనల్స్(మూడో రౌండు) పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు చిత్తూరు, వైఎస్సార్ కడప, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉపాధ్యాయులు హాజరయ్యారు.

నాలుగు కేటగిరీల్లో

సాక్షి స్పెల్‌బీ సెమీ ఫైనల్ పరీక్షలు ఇలా

1, 2 తరగతులకు కేటగిరి	: 1
3, 4 తరగతులకు కేటగిరి	: 2
5, 6, 7 తరగతులకు కేటగిరి	: 3
8,9,10 తరగతులకు కేటగిరి	: 4

విభాగాలుగా లైవ్ ద్వారా పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలో సత్తా చాటిన వారు ఫైనల్‌కు అర్హత సాధించనున్నారు.

పోటీ ప్రపంచానికి స్పెల్‌బీ సరైన వేదిక

ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉన్నత విద్య, ఉన్నత కొలువులకు ఇంగ్లీష్ భాష తప్పనిసరి అని ఆయా పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు తెలిపారు. దీనికోసం చిన్నతనం నుంచే విద్యార్థులకు ఇంగ్లీష్ భాషపై పట్టు సాధించేలా తర్ఫీదు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అందులో భాగంగా సాక్షి నిర్వహిస్తున్న స్పెల్‌బీ పరీక్షలు విద్యార్థులకు ఇంగ్లీష్ భాషపై పట్టుసాధించడానికి దోహదపడుతుందని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విద్యార్థుల ఉన్నత చదువుకు, ఆహ్లాదకరమైన పోటీతత్వం పెంపొందడానికి ప్రతి ఏటా సాక్షి మీడియా గ్రూప్ స్పెల్‌బీ, మ్యాథ్స్‌బీ వంటి పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని సంతోషం వ్యక్తం చేశారు.

ఆత్మవిశ్వాసం రెట్టింపు



ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించేందుకు ఇంగ్లీష్ భాష తప్పనిసరి. సామాజిక బాధ్యతతో పాటు విద్యార్థుల ఉన్నతికి బాటలు వేసేలా సాక్షి మీడియా గ్రూప్ స్పెల్‌బీ నిర్వహించడం అభినందనీయం. స్పెల్ బీ ద్వారా విద్యార్థులు ఇంగ్లీష్ భాషపై పట్టు, నైపుణ్యం సాధించగలుగుతారు. ఇంగ్లీష్ భాషను నలుగురిలో తప్పులు లేకుండా సరైన ఉచ్ఛారణతో మాట్లాడగలుగుతారు. తద్వారా వారిలో ఆత్మవిశ్వాసం రెట్టింపై ఉన్నతంగా రాణించగలుగుతారు.

–సి.వేణుగోపాల్‌రెడ్డి, చైర్మన్, హోలీగ్రీన్ స్కూల్, తిరుపతి

మొదటి స్థానమే లక్ష్యం



గత ఏడాది స్పెల్‌బీ ఫైనల్స్‌లో రెండో స్థానం సాధించాను. ఈ ఏడాది మొదటి స్థానం సాధించడమే లక్ష్యంగా సిద్ధమయ్యాను. స్పెల్‌బీ మెటీరియల్‌ను బాగా చదివాను. తెలియని కొత్త పదాలు, వాటి ఉచ్ఛారణను టీచర్లను అడిగి తెలుసుకున్నాను.

– ఈ.బినిత, 10వ తరగతి, వెంకటాచలం, నెల్లూరు జిల్లా

పలకడం తెలిసింది



స్పెల్‌బీ పరీక్షలో పాల్గొనడం ద్వారా ఇంగ్లీష్ భాషలోని కొత్త పదాలు, వాటి స్పెల్లింగ్స్ తెలుసుకున్నా. వాటితో పాటు ఆ పదాలను ఎలా పలకాలనే విషయాలను మా టీచర్లు నేర్పించారు. స్పెల్‌బీ సెమీ ఫైనల్ పరీక్షను బాగా రాశాను. ఫైనల్‌కు చేరుకుంటాననే నమ్మకం ఉంది. అందుకే బాగా సాధన చేశాను.

– కె.దనీన్, 4వ తరగతి, చిత్తూరు

ఆంగ్లంపై ఆసక్తి



స్పెల్‌బీ పరీక్షకు ఈ ఏడాది తొలిసారిగా హాజరయ్యాను. పాఠశాల, క్వార్టర్ ఫైనల్ స్థాయిలో ప్రతిభ కనబరచి సెమీ ఫైనల్‌కు చేరడం సంతోషంగా ఉంది. స్పెల్‌బీ ద్వారా ఆంగ్లీష్ భాషపై నాకు ఆసక్తి పెరిగింది. కొత్తకొత్త పదాలు తెలుసుకోవడంతో ఆ భాషపై పట్టు సాధించగలిగాను. థ్యాంక్స్ టు సాక్షి.

– తేజస్విని, 5వ తరగతి, కడప

స్పెల్లింగ్స్ నేర్చుకున్నా



నాకు ఇంగ్లీష్ అంటే ఇష్టం. ఇంగ్లీష్ బాగా చదువుతాను. స్కూల్ లెవెల్‌లో అన్ని పదాలకు స్పెల్లింగ్స్ నేర్చుకున్నా. అయితే స్పెల్‌బీ ద్వారా కొత్త పదాలు, వాటి స్పెల్లింగ్స్‌తో పాటు ఆయా పదాలను ఎలా ఉచ్ఛరించాలి అనే విషయాలు నేర్చుకున్నా.

– ఎం.మోనిష్‌రెడ్డి, 5వ తరగతి, తిరుచానూరు

ఆసక్తి పెరిగింది



స్పెల్‌బీ పరీక్షకు ప్రిపేర్ అయ్యే కొద్దీ ఆసక్తి పెరిగింది. స్పెల్‌బీ మెటీరియల్‌లో అనేక కొత్త కొత్త పదాలు ఉన్నాయి. వాటిని తెలుసుకోవడంతో పాటు తప్పులు లేకుండా రాసేందుకు సాధన చేశాను. వాటిని ఎలా పలకాలో టీచర్‌ను అడిగి తెలుసుకున్నా. ఇప్పుడు కొంచెం ధైర్యం వచ్చింది.

–సీఎంవి.బిందుశ్రీ, 3వ తరగతి, కడప

బాగా ప్రాక్టీస్ చేశాను



సాక్షి నిర్వహిస్తున్న స్పెల్‌బీ సెమీ ఫైనల్ పరీక్షకు బాగా ప్రిపేర్ అయ్యాను. స్పెల్‌బీ మెటీరియల్‌లోని కొత్త పదాలు, వాటి స్పెల్లింగ్స్ నేర్చుకున్నా. ఈ పరీక్షలో రాణించి ఫైనల్‌కు చేరుకుని అక్కడ నా ప్రతిభను చాటుకోవాలనుకుంటున్నాను. భాషపై పట్టు సాధించేందుకు ఇది ఉపయోగపడుతోంది.

–సి.విష్ణుప్రియ, కడప

సామర్థ్యం పెరిగింది



ఇంగ్లీష్ భాషలో నాకు ప్రావీణ్యం పెరగడానికి స్పెల్‌బీ దోహదపడింది. అనేక కొత్త పదాలు తెలుసుకున్నా. ఈ స్పెల్‌బీ పరీక్ష ద్వారా ఇంగ్లీష్‌లో సరళంగా, తప్పులు లేకుండా మాట్లాడేందుకు దోహదపడింది. ఈ స్పెల్‌బీ నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించింది.

–కె.హర్షిణి, 7వ తరగతి, తిరుపతి

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR

■ Last Chance:10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry 9381287629

DISTANCE EDUCATION

■ Distance/ Regular for Degree (All), B.Tech (All), Diploma (All), Ph.D (All), 10th, Inter, ITI, AP, TN, TEL-University ద్వారా Aarya Pragna College, 9393622612.

Real Estate

HOUSE FOR SALE

■ తిరుచానూరు గ్రామములోని నేతాజి రోడ్డులో ఒక్కొక్కటి 24 అం.లలో నిర్మించిన రెండు ఇండ్లు అమ్మకమునకు కలవు. సంప్రదించండి. 9550515536.

PLOTS FOR SALE

■ DTCP Approved 2012 Layout on Main Road, Few Prime Plots 30/60 Ankanams Outright Sale Immediately Backside IISER & Near IIT, Yerpedu, 9741077440.

■ ఎర్రచందనం చెట్లతో తిరుపతి IIT దగ్గర ఫైనల్ అప్రూవల్ ప్లాట్లు, అతి తక్కువ ధరకే, కేవలం అం. 12 వేలకు డైరెక్ట్ ఓనర్, స్పాట్ రిజిస్ట్రేషన్. 9502774175, 7995992114.

Services

■ పర్సనల్, బిజినెస్, ప్రాపర్టీ ల్యాండ్స్ & వ్యవసాయ భూములపై మార్టిగేజ్ చేసుకొని అతి తక్కువ వడ్డీకి, వారం రోజులలో రుణం ఇవ్వబడును. ఏజెంట్స్ కావలెను. సంప్ర: 7836085286, 8801923173.

డిస్కౌంట్ సేల్స్

■ Reddy's Pharmacy, Opp.Vijaya Diagnostic, Tirupati లో అన్ని రకాల మందులపై 10% to 20% డిస్కౌంట్, సర్జికల్& ఎమర్జెన్సీ మెడిసన్స్ హోం డెలివరీ కలదు. ✆ 94413 49339.

బంగారం కొనబడును

■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 99 12 72 1888

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 90009 92521

ASTROLOGY

■ శ్రీ అమ్మవారిపూజారి, ఎటువంటి సమస్యనైనా ఫోన్‌లోనే జ్యోతిష్యం చెప్పబడును. ప్రేమ, పెళ్ళి, వ్యాపారం, లక్ష్మీనివాస, విద్య, ఉద్యోగం, ఆరోగ్యం, సంతానం, వశీకరణం, భార్యభర్తల గొడవలు మొ॥ వాటికి 3రోజుల్లో పరిష్కారం. సెల్: 9177077112

BUSINESS SERVICE

BUSINESS OFFER

■ **We Super Stockist** of FMCG Products of Masalas & Deserts is looking for District wise Distributors in TS & AP. www.mleps.in Cont: 70329 43367

DISTRIBUTORS

■ **Wanted Distributors.** షుగర్ వ్యాధి గ్రస్థులకు వాడే నల్ల బియ్యం (Black Rice)కు జిల్లాలు వారిగా డిస్ట్రిబ్యూటర్స్ కావలెను. సంప్ర: 8186097597.

Wanted

WANTED

■ తిరుపతి నందు Agri Labలో ఉద్యోగాలుకోసం Lab Analysit, Q: B.Sc, M.Sc(కెమిస్ట్రీ), Data Entry Asst. Q:ఏదైనా డిగ్రీ (కంప్యూటర్ నాలెడ్జ్) Freshers Apply.08772244866, 9985504424

■ తిరుపతి ఆఫీస్‌లో పనిచేయుటకు లేడీ టెలికాలర్స్ మరియు డెలివరీ బాయ్స్ కావలెను. Q: Inter, Degree, Age: 35yrs Below, ✆ 9542111223.

■ శ్రీపద్మావతి అనందభవన్‌హోటల్‌కు లేడీ క్యాషియర్స్,అనుభవంగల వెయిటర్స్,మాస్టర్స్‌కావలె సం.జీ. 14,000-20,000.12గం.డ్యూటీ, భోజనం &రూంఫ్రీ, కలదు.తిరుచానూరు, 6301490030, 9966707878.

■ SVDA Junior College (Un Academy) Jobs in Tirupati. Wanted Front Office Executive, Receptionist, Tele Callers, Counsellors, Computer Operators, Incharges, Administrative Officer, Qual: Degree (or) PG, Eligible and Intrested candidates can submit their resumes with photo in our college campus (or) send your resume to the given mail Id: hrsvdatpt@gmail.com (or) Contact: 9966222141, 9133380222.

■ కార్పొరేట్ బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగాలు కలవు. Any Degree, జీ: 20,000 పైన (అనుభవం ప్రకారం), వయస్సు-30సం.లోపు. 82977 97197.

■ చిత్తూరు సమీపంలో గల SAAGAZ కాఫీ OUT LETS లో పనిచేయుటకు స్టాల్ సర్వీస్ Executives మరియు Managers కావలెను. అ: 10 నుండి డిగ్రీ వరకు జీ: 15,000 + Allowance ✆ 8888829999, 9966149999

■ బ్యాంకింగ్ సంస్థనందు టెలికాలర్స్ Male / Female-50 కావలెను. జీ:12 to 16వేలు, Q: ఇంటర్, శ్రీనివాసపురం సచివాలయం దగ్గర, తిరుపతి, 7702521605, 82488 75238.

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059508586

■ For a Factory @ Nagari (AP), SO-well experienced Ex-Ser/Civil with good working knowledge. ASO & Guards Qly:Graduate/ SSLC. Salary as per MW act, 8 hours with Weekly Off. Age: 30-50, Free Accommodation & Canteen available. Ph: 9840731203, 7358188113

■ ప్రముఖ మ్యాట్రిమోని ఆఫీస్‌లో పనిచేయుటకు అనుభవం గల "లేడీ" కస్టమర్ కేర్ Officer కావలెను. "Work" Office లో మాత్రమే Q: Inter, డిగ్రీ (or) PG Computer నాలెడ్జ్ Age: 25 to 35 Sal: 17వేలు, రేణిగుంట రోడ్డు, తిరుపతి. Sunday: Holiday, Time: 9.30 AM to 6.30 PM ✆ 9000939738.

■ M/s Gurappa Parameswara Electrical & Civil Works, Tirupati Wanted Accountant with MBA (or) CA to manage all Accounting Transactions, Exp. 3-5Years (M/F), Sal: 20-25K, Email: gurappaparameswara@gmail.com, Contact Cell: 8123459658, 9741853991.

■ శ్రీరామ్ ఫైనాన్స్ లి. బ్రాంచిలు నందు & మండలాలవారిగా పనిచేయుటకుField Executives కావలెను. డిగ్రీ లోపు 28సం.లు యువకులు కావలెను. జీతం.15,000 +ఇన్సెం టివ్, టూ వీలర్ మస్ట్, సంప్ర.kavitha.pasupulet@shriramfinance.me ✆ 9121152397.

■ Airport Ground Staff & Bank Jobs. 15K & 25K, 10th, Inter, ITI, Dip, Any Degree P/F & Manager కావలెను, 20K to 30K Cont: 8712390905

■ తిరుపతి లోని ఒక లాడ్జిలో పనిచేయుటకు రూం బాయ్స్ వెంటనే కావలెను. తగినజీతం+భోజనం+వసతి.సంప్రదించండి: 9052072006, 8019518646.

■ తిరుపతి కరకంబాడి రోడ్ వద్ద గిఫ్ట్ షాప్ నందు పనిచేయుటకు 10th, ఇంటర్ చదివిన అవివాహిత యువతి కావలెను. ✆ 83092 57552.

■ Urgent requirement B.Sc Nursing, GNM, ANM, Inter, 10 + Care Takers, (M/F) Ex & Freshers. Ph : 70137 98645, 76708 28890. SSK Home Health Care Agency, Tirupati.

■ Wanted Bank Part time Field verification Executives, Locations: Puttur, Nagari, Palamaneru, Srikalahasti, Venkatagiri Contact No: 90307 43622, 98484 90861

■ ప్రముఖ కంపెనీకి మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్‌టైం 1గం॥ పోస్టల్ కవర్స్‌పై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. కాల్/వాట్సాప్. 9704987227

■ VIP's ఇంట్లో పేషెంట్ ని చూసుకొవడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను, ఆయా, వార్డ్ బాయ్స్, నర్సులు, వంటవారు, Rmp. Dr. Q:5th-Degree, 10-30 వేలు జీతం, భో+రూం ఫ్రీ, Hyd. Ph: 7995374999

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారాని 83500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 8573833520, 9059833520

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను, ఫ్రీ వసతి + భోజనం, జీ. 18k. ఏజెంట్ కమీషన్ 3k. ఫోన్ : 9840259888, 9840198899.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశ్వసించి నిర్ణయం తీసుకునేముందు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రకటనదారుల మోసాలకు, ప్రకటనలలోని అంశాలకు ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నాలుగులైన్ల ప్రకటనకు రూ. :375/-
అదనపు లైనుకు రూ. :90/-
CONTACT : 9440166091, 9951602970

క్రీడలతోనే ఉజ్వల భవిత



విజేతలకు బహుమతులు అందజేసిన మంత్రి రోజా, క్రీడా శాఖాధికారులు

తిరుపతి ఎడ్యుకేషన్: చదువుతో పాటు క్రీడల్లో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర పర్యాటక, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే.రోజా తెలిపారు. తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో రెండు రోజులపాటు జరిగిన 66వ స్కూల్ గేమ్స్ అండర్–14, 17 రోల్‌బాల్ క్రీడా పోటీలు ఆదివారం ముగిశాయి. దీనికి హాజరైన మంత్రి రోజా మాట్లాడుతూ, యువత క్రీడల పట్ల ఆసక్తి చూపడం ద్వారా శారీరక, మానసిక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవడుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు, ట్రోఫీలు, పతకాలను అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ కార్యదర్శి బాబు, నిర్వాహకులు చంద్రకుమార్, శ్రీమన్నారాయణ, మదన్‌మోహన్, ప్రభాకర్, రోల్ బాల్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రతాప్, కార్తీక్, అనిల్‌కుమార్‌రెడ్డి, పీడీలు పూర్ణచంద్ర, శ్రీధర్, సురేష్, విజయ్‌కుమార్, గణేష్, పీవీ.రమణ, క్రీడాకారులు హాజరయ్యారు.

విజేతలు వీరే

అండర్–17 బాలుర రోల్ బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో మొదటి రెండు స్థానాలను చిత్తూరు, విశాఖపట్నం జట్లు, బాలికల విభాగంలో కృష్ణా జిల్లా, నెల్లూరు జిల్లా జట్లు మొదటి రెండు స్థానాలు, అండర్–14బాలుర విభాగంలో మొదటి రెండు స్థానాలను చిత్తూరు, కృష్ణా జిల్లా జట్లు, బాలికల విభాగంలో మొదటి రెండు స్థానాలను కృష్ణా, నెల్లూరు జిల్లా జట్లు సాధించాయి.

నిరుద్యోగిత నిర్మూలనే జగనన్న లక్ష్యం



జాబ్‌మేళాలో యువతను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి

- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి
- ఎంపీ గురుమూర్తి నేతృత్వంలో మెగా జాబ్‌మేళా



జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులు

తిరుపతి మంగళం : రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పించి, నిరుద్యోగిత నిర్మూలనే జగనన్న లక్ష్యమని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అన్నారు. తిరుపతి–కరకంబాడి మార్గంలోని కొండా కల్యాణ మండపంలో ఆదివారం తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి నేతృత్వంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాకు తిరుపతి జిల్లా నుంచి నిరుద్యోగులు తరలివచ్చారు. 'ఇరా' ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ, హెచ్‌ఆర్ కంపెనీల సహకారంతో 30 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ గతంలో బాబు వస్తే జాబు వస్తుందన్న ప్రచారం చేసిన చంద్రబాబు తన పాలనలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని గుర్తుచేశారు. కేవలం ఆయన కుమారుడు లోకేష్‌కు మంత్రి పదవి ఇచ్చి స్వార్థం చూసుకున్న ద్రోహి చంద్రబాబు అని విమర్శించారు. ఎంపీ మద్దిల గురుమూర్తి మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తే యువత భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్న లక్ష్యంతో జగనన్న అనేక ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. ఉద్యోగం కల్పిస్తే ఆ యువత కుటుంబానికి అండగా ఉంటారన్నారు. జగనన్న ఆశయాలకు అనుగుణంగా తిరుపతిలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 383 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు చెప్పారు. మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ తిరుపతి పరిధిలో అనేక ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయని, ప్రతి సంవత్సరం వేల సంఖ్యలో విద్యార్థులు బయటకు వచ్చి ఉద్యోగాలు లేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. వారికి బంగారు భవిష్యత్తును కల్పించేందుకు ఎంపీ గురుమూర్తి మెగా జాబ్‌మేళా నిర్వహించడం అభినందనీయమన్నారు. డిప్యూటి మేయర్ ముద్రనారాయణ, ప్రముఖ కంపెనీల ప్రతినిధులు, యువత పాల్గొన్నారు.

బాలిరెడ్డిపాళెం ప్రభుత్వాస్పత్రిలో విచారణ

వాకాడు: మండలంలోని బాలిరెడ్డిపాళెం ప్రభుత్వ ఆస్పత్రిలో ఆదివారం మెడికల్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ స్టేట్ డైరెక్టర్ రామిరెడ్డి విచారణ చేపట్టారు. ఆయన ఆస్పత్రిలోని వైద్య సదుపాయాలను పరిశీలించి, వైద్యులతో మాట్లాడారు. ఇటీవల ఆస్పత్రిలో పనిచేస్తున్న ఓ డిప్యూటీ వైద్యుడు, యూడీసీ, కొందరు వైద్య సిబ్బంది మధ్య వివాదం తలెత్తింది. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు డైరెక్టర్ వారిని విచారించారు.

రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ నేత దుర్మరణం



మృతి చెందిన మల్లికార్జున

చంద్రగిరి: రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ నేత దుర్మరణం పాలైన సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు, పనపాకం పంచాయతీ కోనంగివారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ మండల కార్యదర్శి మల్లికార్జున(44) ద్విచక్ర వాహనంపై తిరుపతికి వెళ్లాడు. తిరిగి వస్తుండగా పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై హెరిటేజ్ సమీపంలో వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. ద్విచక్ర వాహనంతోపాటు మల్లికార్జున అవతలి రోడ్డుపై పడ్డాడు. అదే సమయంలో చిత్తూరు నుంచి తిరుపతికి వస్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమార్తె ఉంది.

ద్విగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే

వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లికార్జున మరణంపై ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. అలాంటి వ్యక్తి మృతి చెందడం పార్టీకి తీరనిలోటు అని చెప్పారు. పార్టీ తరఫున, వ్యక్తిగతంగా ఆయన కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు.

వైఎస్సార్‌సీపీలోకి వలసల జోరు



కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట/శ్రీకాళహస్తి: రేణిగుంట మండలం గుత్తివారిపల్లికి చెందిన 30మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. శ్రీకాళహస్తి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో టీడీపీ నాయకులు కృష్ణారెడ్డి, గురవయ్య, హేమాద్రిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, చీరాలరెడ్డి, నాగభూషణంరెడ్డి, చెంగల్రాయులు, వాసుదేవరెడ్డి, కిరణ్‌కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకతీతంగా అందిస్తున్న సంక్షేమ పథకాలు, పారదర్శక పాలనకు ఆకర్షితులైనట్లు తెలిపారు. అదే విధంగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి, ప్రజలకు అందుబాటులో ఉంటూ చేపడుతున్న సేవా కార్యక్రమాలను చూసి ఆయన వెంట నడవాలని భావించి తామంతా వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే వారిని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మునిరెడ్డి, ధనంజయ రెడ్డి, సుబ్రమణ్యంయాదవ్ పాల్గొన్నారు.